పేదల జీవితాల్లో వెలుగు

- అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు
- పాణ్యం ఎమ్మెల్యే కాటసాని, మేయర్ బీవై రామయ్య
- అట్టహాసంగా 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం ప్రారంభం




ఇంటికి జగనన్న సువ్వే మా నమ్మకం స్టిక్కర్ అంటిస్తున్న ఎమ్మెల్యే కాటసాని, ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బీవై రామయ్య

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదల జీవితాల్లో వెలుగులు నింపారని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 19వ వార్డు రాజేశ్వరి నగర్‌లో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం ప్రారంభించారు. అంతకుముందు శకుంతల కళామందిర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులోని నాయకులు ఎమ్మెల్యే, మేయర్‌ను భారీ గజమాలతో సత్కరించి స్వాగతం పలికారు. అనంతరం రాజేశ్వరి నగర్‌లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరు గురించి అడిగి ప్రజా మద్దతు బుక్‌లో నమోదు చేసి, 8296082960 నంబర్‌కు మిస్డ్ కాల్ చేయించారు. ఇంటి యజమాని అనుమతితో 'మా నమ్మకం నువ్వే జగన్' స్టికర్‌ను అతికించారు.అనంతరం ఎమ్మెల్యే, మేయర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ప్రజారంజక పాలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారన్నారు. ప్రజాభిప్రాయాన్ని తెలుసుకునేందుకు తాము ఇంటింటికీ వస్తున్నట్లు చెప్పారు. నిజయితీ, విలువలతో కూడిన రాజకీయ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. అవినీతికి చోటు లేకుండా పారదర్శక పాలన అందిస్తున్నారన్నారు. రానున్న శాసనసభ ఎన్నికల్లో 175 స్థానాలు గెలుపే తమ పార్టీ లక్ష్యమన్నారు.

ప్రజలకు చేసిన మంచిని వివరిస్తున్నాం

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిన మంచిని ప్రజలకు వివరిస్తున్నట్లు ఎమ్మెల్యే, మేయర్ అన్నారు. 2019 ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశామన్నారు. మేనిఫెస్టోను తమ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా భావిస్తారన్నారు. చాలా మంది నాయకులు ఎన్నికలు పూర్తయ్యాక హామీలను పట్టించుకోరని, అందుకు టీడీపీ అధినేత చంద్రబాబే నిదర్శనమన్నారు. 2014 ఎన్నికల సమయంలో రుణమాఫీ పేరుతో రైతులను, పొదుపు మహిళలను వంచించారన్నారు. తమ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం పొదుపు మహిళల రుణాలు మాఫీ చేశారన్నారు. కరోనా ప్రభావంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు చేస్తున్నారన్నారు. గత టీడీపీ పాలన కాలంలో కూడా రాష్ట్ర బడ్జెట్ ఇలాగే ఉండేదన్నారు. అయితే, గత పాలకులు ఇన్ని సంక్షేమ పథకాలు అందించలేదన్నారు. జన్మభూమి కమిటీలు సిఫారసు చేసిన వారికే అప్పట్లో సంక్షేమ ఫలాలు అందేవన్నారు. ప్రస్తుతం పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలకే రూ. 2లక్షలు కోట్లు ఖర్చు చేసిన ఘనత తమ ప్రభుత్వానిదన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా బడుగు, బలహీన వర్గాలకు రాజకీయంగా అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీని ఆదరించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బి.మహేశ్వర్‌రెడ్డి, కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ మీదివేముల ప్రభాకర్‌రెడ్డి, కల్లూరు జెడ్పీటీసీ ఆల ప్రభాకర్‌రెడ్డి, పాణ్యం మాజీ జెడ్పీటీసీ సూర్యనారాయణరెడ్డి, కార్పొరేటర్లు చిట్టెమ్మ, మాధురి, అరుణ, శ్వేతారెడ్డి, సాన శ్రీనివాసులు, సుదర్శన్‌రెడ్డి, డీఎల్ కాంతారెడ్డి, జయరాముడు, నరసింహులు, లక్ష్మీరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు కేశవరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, హనుమంతురెడ్డి, డైరెక్టర్లు వై.సుధా, గోపాల్‌రెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, పుల్లారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుభాషిణి పాల్గొన్నారు.

నేడు రన్ ఫర్ జీసస్ ర్యాలీ

కర్నూలు (టౌన్): కర్నూలు నగరంలో శనివారం నిర్వహించనున్న రన్ ఫర్ జీసస్‌ర్యాలీని విజయవంతం చేయాలని ఈఎస్‌టీ వ్యవస్థాపకులు దాసరి సుధీర్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక రాక్‌వుడ్ మెమోరియల్ చర్చి ప్రాంగణంలో ఈఎస్‌టీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు పట్టణంలోని అన్ని డినామినేషన్లకు సంబంధించిన క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు. రన్ ఫర్‌జీసస్ ర్యాలీ స్థానిక ఆర్‌సీఎం చర్చి నుంచి ప్రారంభమై ఎస్‌బీఐ సర్కిల్, ఆర్‌ఎస్ రోడ్డు, మౌర్య ఇన్, రాజ్‌విహార్, కలెక్టరేట్ మీదుగా సి.క్యాంపు ప్రార్థన మందిరానికి చేరుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో అతిథులుగా కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి, కర్నూలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ టీజీ భరత్, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు పాల్గొంటున్నట్లు చెప్పారు.



మాట్లాడుతున్న ఈఎస్‌టీ వ్యవస్థాపకులు దాసరి సుధీర్

క్లుప్తంగా

డాక్టర్ అరుణ్‌కు హెల్త్‌కేర్ ఎక్సలెన్సీ అవార్డు



డాక్టర్ అరుణ్‌కు అవార్డు అందజేస్తున్న మేయర్ బీవై. రామయ్య

కర్నూలు(హాస్పిటల్):కర్నూలుకు చెందిన హోమియోపతి వైద్యనిపుణులు, వెల్నెస్ హోమియో క్లినిక్స్ సీఈవో డాక్టర్ అరుణ్‌కుమార్‌కు యునైటెడ్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ(ఫ్లోరిడా) కోఆర్డినేటర్ నటరాజన్ నేతృత్వంలో హెల్త్‌కేర్ ఎక్సలెన్సీ అవార్డును ప్రదానం చేశారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కర్నూలు నగర మేయర్ బీవై. రామయ్య చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో విశ్రాంత డీఎస్పీ సుదర్శన్‌రావు, మాజీ కార్పొరేటర్ సురేందర్, సల్మాన్‌రాజ్, డాక్టర్ అరుణ్ మాతృమూర్తి గుడిపల్లె ఆనందమ్మ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలు నగరంలో శనివారం చేపట్టే నిర్వహణ పనుల కోసం విద్యుత్ కోతలు విధించనున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ టౌన్ ఈఈ రమేష్, కర్నూలు–1, రూరల్స్, ఏడీఈలు రాజమోహన్ రెడ్డి, సుబ్బన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ సబ్ డివిజన్ల పరిధిలోని 33 సబ్‌స్టేషన్లు, పోలీస్ క్వార్టర్స్, ప్రభుత్వ ఆసుపత్రి, ఎస్‌ఏపీ క్యాంప్, రేడియో స్టేషన్, సెంట్రల్ సెక్షన్, బళ్లారీ రోడ్డు, వీకర్ సెక్షన్ కాలనీ, నిర్మల్ నగర్, బాబా బృందావన్ నగర్, నరసింహరావు పేట, కొత్తపేట, నరసింహారెడ్డి నగర్, కింగ్ మార్కెట్, ప్రకాష్ నగర్, ఓర్వకల్లు, కర్నూలు మండలాల్లోని 33, 11కేవీ ఫీడర్లు, గ్రామాల్లో ఈ పనులు జరుగనున్నాయని పేర్కొన్నారు. ఈ సబ్‌స్టేషన్ల ద్వారా సరఫరా అందించే కాలనీలు, గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. సాధారణంగా ప్రతి నెలా 2వ శనివారం నిర్వహించాల్సిన పనులు చేపడుతున్నామని, ఈ అసౌకర్యానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

అమెరికాలో తెలుగువారి రక్తదానం



అమెరికాలో రక్తదానం చేస్తున్న సుమన్ స్నేహితులు

కర్నూలు(హాస్పిటల్): తన తండ్రి డేనియల్ రాజు స్మారకంగా ఫౌండేషన్ ఏర్పాటు చేసి రక్తదాన,సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కార్మిక శాఖ ఉద్యోగి సుమన్ స్ఫూర్తితో ఆయన స్నేహితులు అమెరికాలోనూ సేవా కార్యక్రమాలు ప్రారంభించారు.అమెరికాలో ఉండే సుమన్ స్నేహితురాలు సుష్మా సహకారంతో రెండేళ్ల క్రి తం అక్కడ మొదటి రక్తదానం చేయగా, తాజా గా ఇప్పుడు మరోసారి అక్కడి అట్లాంటాలో సౌత్‌లైఫ్ కమ్యూనిటీ బ్లడ్‌సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో కిశోర్, ప్రదీ ప్, రామకృష్ణలు రక్తదానం చేశారు. వీరందరూ భారతీయులే గాక అందరూ తెలుగువారు కావడం విశేషం.

సేవా కార్యక్రమాల్లో ఏఐటీయూసీ

కర్నూలు(సెంట్రల్): సామాజిక సేవా కార్యక్రమాల్లో ఏఐటీయూసీ ముందుండాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఆర్‌ఎస్ రోడ్డు సర్కిల్‌లో హోటల్, బేకరి వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు బి.గిడ్డయ్య, మునెప్ప, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

9న లక్ష్మీగణపతి హోమాలు

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో సంకట హర చతుర్థి సందర్భంగా ఈ నెల 9వ తేదీన వినాయక స్వామి వారికి అభిషేకాలు, లక్ష్మీ గణపతి హోమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివ రామకృష్ణ తెలిపారు. భక్తులు అందరూ పూజల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

'మోదీ ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలి'

కర్నూలు(సెంట్రల్): అదానీ అవినీతిపై పార్లమెంట్‌లో విపక్ష పార్టీలు అడుగుతున్న జాయింట్ పబ్లిక్ కమిటీ(జేపీసీ) వేయాలని, 9ఏళ్ల పాలనలో మోదీ ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం కర్నూలులోని సీఆర్ భవన్‌లో కర్నూలు జిల్లా సమితి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేసిన బీజేపీ ఏమి సాధించిందని ప్రశ్నించారు. రాహుల్‌గాంధీకి పార్లమెంట్‌లో 22 పార్టీల మద్దతు ఉందని, ఆయా పార్టీలు డిమాండ్ చేస్తున్నట్లు అదానీపై జేపీసీ వేయాలన్నారు. ఆయనపై విచారణకు ఎందుకు బీజేపీ జంకుతుందో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. 2014 కన్నా ముందు ప్రపంచ కుబేరుల జాబితాలో 69వ స్థానంలో ఉన్న అదానీ నేడు ఏకంగా రెండో స్థానానికి ఎలా వచ్చారో ప్రజలందరికీ తెలుసన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ పాల్గొన్నారు.

జగనన్నది అవినీతి రహిత పాలన

- ఎవరి సిఫార్సులు లేకుండా సంక్షేమ పథకాల అమలు
- ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్
- చెప్పిన ప్రతి హామీ నెరవేర్చాం
- ప్రజల సూచనలు, సలహాలను స్వీకరిస్తాం
- ప్రతిపక్షాల అబద్ధాలను తిప్పికొడుదాం
- పార్టీ జిల్లా అధ్యక్షుడు రామయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్, చిత్రంలో మేయర్ బీవై రామయ్య, కర్రా హర్షవర్ధన్‌రెడ్డి

కర్నూలు(రాజ్‌విహార్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి రహిత పాలన అందిస్తున్నారని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. శుక్రవారం స్థానిక కొండారెడ్డి బురుజు వద్ద 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అవినీతికి హద్దు లేదన్నారు. జన్మభూమి కమిటీలు సిఫార్సు చేసిన వారికే పథకాలు వచ్చేవని, వారికి అడిగినంత ఇస్తేనే సిఫార్సులు చేసేవారని చెప్పారు. పేదల కష్టాలను కళ్లారా చూసి హామీలిచ్చిన జగన్‌ను ప్రజలు ఆశీర్వదించారని, దీంతో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అవినీతి రహిత, పారదర్శకవంతమైన పాలన అందిస్తున్నారని చెప్పారు. ఎవరి సిఫార్సులు అవసరం లేకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలు మంజూరు చేసే విధానాన్ని తీసుకొచ్చారని, దీంతో నేరుగా లబ్ధిదారుల ఖాతాలోకి నగదు జమ చేస్తూ వస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని చెప్పారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు వార్డు కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి ఈ నెల 20వ తేదీ వరకు ఇంటింటికి వెళ్లి సర్వే చేయనున్నట్లు తెలిపారు. అనంతరం పార్టీ అధ్యక్షుడు బీవై రామయ్య మాట్లాడుతూ సీఎం జగన్ ఎంతో పారదర్శక పాలన అందిస్తుంటే ఓర్వలేని టీడీపీ నేతలు ఎల్లో మీడియాతో కలిసి అసత్య ప్రచారానికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రతిపక్షాల అబద్ధాలను తిప్పికొట్టేందుకు ప్రతి కార్యకర్త సిద్ధమవ్వాలని, సీఎం జగన్ గతంలో చెప్పిన ప్రతి హామీ నెరవేర్చారని, దీని వల్ల కలిగిన ప్రయోజనాలను జనానికి వివరించాలని చెప్పారు. వారి నుంచి సూచనలు, సలహాలను స్వీకరించాలని, దీంతో మరింత మంచి పాలనకు కృషి చేస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేసి వచ్చే ఎన్నికల్లో పార్టీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు కర్ర హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ తెచ్చిన ఏ పథకమైనా కుల మతాలు, రాజకీయాలు చూడకుండా అమలు చేస్తూ వస్తున్నారు. పథకాల కోసం ప్రజలు అధికారులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చారని, వలంటీర్ల ద్వారా ప్రతి ఇంటికి సేవలందిస్తున్నారని కొనియాడారు. వీటిపై వార్డు కన్వీనర్లు, గృహ సారథులు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షురాలు సిత్ర సత్యనారాయణమ్మ, పార్టీ నాయకులు మద్దయ్య, ఆది మోహన్‌రెడ్డి, సయ్యద్ ఆసీఫ్, కార్పొరేటర్లు షాషావలి, అర్షియా ఫర్షిన్, వాసు, విజయలక్ష్మి, షేక్ అహ్మద్, కృష్ణకాంత్ రెడ్డి, వార్డు కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు. అనంతరం ఆయన వార్డుల్లో పర్యటించి ప్రభుత్వ పథకాల వల్ల కలిగిన లబ్ధి, జరిగిన మంచి, ఇంకా చేయాల్సిన పనులను అడిగి తెలుసుకున్నారు.

'శ్రీ హనుమద్ వైభవం' పుస్తకావిష్కరణ



గణేష్ నగర్‌లోని జర్నలిస్టు కాలనీలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రీహనుమద్ వైభవం పుస్తకావిష్కరణ గావిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కర్నూలు కల్చరల్: ప్రముఖ రచయిత విద్వాన్ మారేడు రాముడు రచించిన 'శ్రీ హనుమద్ వైభవం' పుస్తకావిష్కరణ కార్యక్రమం శుక్రవారం గణేష్‌నగర్‌లోని వెంకటేశ్వర, ఆంజనేయ స్వామి దేవాలయంలో జరిగింది. సాహితీవేత్తలు వైద్యం వెంకటేశ్వరాచార్యులు, జేఎస్‌ఆర్కే శర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తులసీ దాసు రచించిన హనుమాన్ చాలీసాకు చాలా చక్కని రీతిలో తెలుగు అనువాదం చేస్తూ సరళ కంద పద్యాలలో హనుమద్ వైభవంను రచించారన్నారు. హనుమాన్ చాలీసా చదువుకునే భక్తులకు ఇది విశేషంగా ఉపయోగ పడుతుందన్నారు. తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ దండబోయిన పార్వతీ దేవీ పుస్తక సమీక్ష చేశారు. హనుమంతుని భక్తిని శక్తిని యుక్తిని అందరం గ్రహించ వలసిన అవసరం ఉందన్నారు. హనుమాన్ జీవితం ద్వారా వ్యక్తిత్వ వికాసం పొందవచ్చన్నారు. శ్రీపరాశర సంహితను ఉత్తర రామాయణాన్ని, తులసి రామాయణాన్ని, కంబ రామాయణాన్ని వాల్మీకి రామాయణాన్ని ఇతర రామ కథలను పరిశీలించి 83 అంశాలను హనుమద్ చరిత్రను ఒక చోట చేర్చి అందించడం రచయిత నైపుణ్యమన్నారు. కార్యక్రమంలో శతావధాని మద్దూరు రామమూర్తి, రచయిత గొరెడ్డి హరిశ్చంద్రారెడ్డి, గుర్రప్ప, వెంకట రమణమూర్తి, లక్ష్మయ్య, వెంకట రామిరెడ్డి, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన మురుగునీరు

- పట్టించుకోని మున్సిపల్ సిబ్బంది



బాపూజీ నగర్ మాతమ్మ గుడి వద్ద రోడ్డుపై పారుతున్న మురుగునీరు

కర్నూలు (టౌన్): నగరంలో పారిశుద్ధ్యం అటకెక్కింది. ప్రతి రోజు సచివాలయాల పరిధిలో పారిశుద్ధ్య పనులు చేస్తున్నట్లు రికార్డుల్లో నమోదు అవుతున్నా.. వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. నగరపాలక సంస్థ పరిధిలోని 12వ వార్డు బాపూజీనగర్‌లోని మాతమ్మ దేవాలయం సమీపంలో డ్రైనేజీ కాల్వలు నిండి ఎక్కడికక్కడ మురుగు నిలిచిపోయింది. మూడు రోజులుగా మురుగు కాస్తా రోడ్డు మీదకు, కాలనీవీధుల్లోకి పారుతుండటంతో దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. వారు సచివాలయ సిబ్బందికి, మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. మాతమ్మ గుడి సమీపంలోకి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నట్లు మహిళలు వాపోతున్నారు.

ఎప్పుడూ ఇదే సమస్య వస్తోంది :

మాతమ్మ దేవాలయం గుడికి వెళ్లాలంటేనే ఎప్పుడూ మురుగు సమస్యే. మురుగు కాల్వలు నిండి రోడ్డు మీదకు మురుగునీరు వచ్చాయి. వాసన వస్తోంది. కనీసం గుడికి వెళ్లలేకపోతున్నాం. డ్రైనేజీ కాల్వలు శుభ్రం చేయకపోవడంతోనే ఈ దుస్థితి.

–పెంచలమ్మ, బాపూజీనగర్



కోల్స్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న రెవరెండ్ అనిల్‌కుమార్ సామ్యేల్, పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే



సీఎస్ఐ చర్చిలో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలో పాస్టర్ రెవరెండ్ పెద్దేటి ఇమ్మానియేల్, క్రైస్తవ భక్తులు

కర్నూలు (టౌన్): కర్నూలు నగరంలో శుక్రవారం గుడ్‌ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కరుణామయుడు ఏసుక్రీస్తును స్మరించుకుంటూ క్రైస్తవులు చర్చీలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రత్యేక గీతాలు ఆలపించారు. శిలువ మరణంలో క్రీస్తు పలికిన 7 మాటలను వక్తలు వివరించారు. నగరంలోని సీఎస్ఐ చర్చి ఫాదర్ రెవరెండ్ ఇమ్మానియేలు, కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చి పాస్టర్లు జీవన్‌రావు, రెవరెండ్ అనిల్‌కుమార్ సామ్యేల్, గిప్సన్ చర్చి పాస్టర్ కృపాదానం స్టాంటన్ మెమోరియల్ చర్చి, సి.క్యాంపు మందిరం పాస్టర్ రెవరెండ్ గంటా కరుణాసాగర్, హోసన్న మందిరం పాస్టర్ బ్రదర్ ఫ్రెడ్డీపాల్, యేహోవా షమ్మా చర్చి పాస్టర్ స్టీఫెన్ చార్లెస్, హోరేబు చర్చి దైవసందేశకులు బ్రదర్ సమ్సోనన్న, ఇమ్మానుయేలు చర్చి పాస్టర్ పాల్ ఆగస్టీన్ ప్రార్థనలు చేశారు. పునీత తెరిసమ్మ ఆర్‌సీఎం చర్చి గుడ్‌ఫ్రైడే వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి శిలువను మోశారు. బిషప్ చర్చికి చెందిన ఫాదర్ చౌడప్ప ఆంథోనప్ప, కె. ఆంథోనీ రాజ్, ఫాదర్ రాజేంద్ర, ఫాదర్ దేవదాసు ఆధ్వర్యంలో శిలువతో ర్యాలీ నిర్వహించారు. ఆర్‌ఎస్ రోడ్డులోని వైఎంసీఏ హాలులో లెమెన్స్ ఇవాలెంజికల్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో గుడ్‌ఫ్రైడే నిర్వహించారు. పాస్టర్ దత్తుబాబు దైవసందేశం అందించారు.



హోసన్న మందిరంలో క్రైస్తవులకు దైవ సందేశం ఇస్తున్న పాస్టర్ ఫ్రెడీ పాల్

నేడు జాబ్ మేళా

కోడుమూరు రూరల్: నిరుద్యోగ యువతీ యువకుల కోసం శనివారం కోడుమూరులోని స్నేహ వినాయక కల్యాణ మండపంలో కుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ జగనన్న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ స్టేట్ కమిటీ సభ్యుడు సంధ్య విక్రమ్ కుమార్ శుక్రవారం తెలిపారు. ఈ జాబ్ మేళాకు ముత్తూట్, అపోలో, టాటా, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ, ఆదాని సొల్యూషన్ తదితర 35రకాల కంపెనీలు వస్తాయన్నారు. 10వతరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ ఆపై చదువుకున్న నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వీఆర్‌కు కోడుమూరు ఎస్ఐ

కర్నూలు : కోడుమూరు ఎస్ఐ విష్ణు నారాయణను వీఆర్‌కు పంపుతూ పోలీసు ఉన్నతాధికారులు శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం బందోబస్తు విధుల నిమిత్తం విజయవాడకు వెళ్లిన ఈయనపై కొంతకాలంగా అవినీతి ఆరోపణలు రావడంతో వీఆర్‌కు పంపినట్లు సమాచారం .కాగా ఆయన స్థానంలో కర్నూలు త్రీటౌన్‌లో పనిచేస్తున్న శ్రీనివాసులును ఇన్‌చార్జ్‌గా నియమించినట్లు తెలిసింది.

బీసీల సంక్షేమానికి బీజేపీ పెద్దపీట

- బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యదరి డాక్టర్ పార్థసారథి

కర్నూలు కల్చరల్: బీసీల సంక్షేమానికి బీజేపీ పెద్దపీట వేస్తుందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యదరి డాక్టర్ పార్థసారథి వాల్మీకి అన్నారు. శుక్రవారం ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోదీ నాయకత్వంలోనే బీజేపీ ప్రభుత్వం దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఓబీసీల అభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. బీసీలను అక్కున చేర్చుకునేందుకు ఈ నెల 16వ తేదీ వరకు దేశ వ్యాప్తంగా ఇంటింటికి, గ్రామగ్రామానికి ఓబీసీ మోర్చా కార్యక్రమం చేపడుతున్నామన్నారు. జొహరాపురం నీలకంఠేశ్వర స్వామి దేవాలయం భూములను అధికారులు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కై భూకబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బీజేపీ ఓబీసీ మోర్చా జోనల్ ఇన్‌చార్జ్ మురళీ నాయుడు, నీలకంఠేశ్వర స్వామి ఆలయం కమిటీ కార్యదర్శి నక్కల మిట్ట శ్రీనివాసులు మాట్లాడారు.

రక్తహీనతతో అనేక సమస్యలు

కర్నూలు(హాస్పిటల్): రక్తహీనత కారణంగా శరీరంలో అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్స్ ప్రతినిధి డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ చెప్పారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా 177, నైస్ స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక వెంకటరమణ కాలనీలో రక్తహీనతపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లల్లో, ఎదుగుతున్న బాలికల్లో, యువతీయువకుల్లో, ముఖ్యంగా గర్భిణీల్లో రక్తహీనత వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. రక్తహీనతను లక్షణాలను ముందుగానే గుర్తించి తగిన వైద్యాన్ని పొందాలన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తహీనతను గుర్తించేందుకు అనేక వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మెంబర్లు పవన్, సి.దాసరి గోవర్ధన్‌రెడ్డి, మంజునాథ్‌రెడ్డి, చిన్నస్వామి, రాయపాటి నాగలక్ష్మి, మణి పాల్గొన్నారు.